మా కలం.. మీ గళం..

# మన గళం

RNI : APTEL/ 2017/74310

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 201 | శనివారం | 24 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



2 లో..



### ముంచుకొస్తున్న మంచు తుఫాను..

## వణికిపోతున్న అమెరిక..!

మన గళం డెస్క్ : అగ్రరాజ్యం అమెరికాపై ప్రకృతి తీవ్రంగా ప్రతాపం చూపుతోంది. టెక్సాస్ నుంచి బోస్టన్ వరకు దాదాపు రెండు వేల మైళ్ల విస్తీర్ణంలో విస్తరించిన భారీ మంచు తుఫాను తూర్పు, మధ్య ప్రాంతాలను అతలాకుతలం చేస్తోంది. సుమారు 23 కోట్ల మంది ప్రజలపై ఈ తుఫాను ప్రభావం పడటంతో అధికారులు అధిక హెచ్చరికలు జారీ చేశారు. భారీగా కురుస్తున్న మంచు, గడ్డకట్టే వర్షాల కారణంగా విద్యుత్ లైన్లు తెగిపోయే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

2 లో..



# ఇప్పటినుంచే సిద్ధం కావాలి

- 2027 గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- దాదాపు 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వ అంచనా
- పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- కొత్తగా 139 ఘాట్లు నిర్మించాలని ప్రణాళిక రూపకల్పన

మన గళం, అమరావతి : 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అమరావతిలో తొలిసారిగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఇప్పటినుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా కట్టుదిట్టమైన కార్యాచరణ చేపట్టాలని స్పష్టంగా సూచించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. గోదావరి నది ప్రవహించే పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న 234 ఘాట్లకు తోడు కొత్తగా మరో 139 ఘాట్లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రణాళికతో మొత్తం 373 ఘాట్లను నదీ తీరం వెంబడి సుమారు 9,918 మీటర్ల పొడవున అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్నాన ఘాట్లు,

2 లో..



### హైకోర్టు జడ్జితో సీనియర్

## లాయర్ వాగ్వాదం




- హైకోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- విద్యుత్ బిల్లు కేసే వాగ్వాదానికి కారణం.. న్యాయస్థానంలో ఉద్రిక్తత
- క్షమాపణలు చెబితే పరిగణనలోకి తీసుకోండి..
- హైకోర్టుకు సుప్రీం సూచన

మన గళం, న్యూఢిల్లీ : ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తితో జరిగిన వాగ్వాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ వ్యవహారంలో సీనియర్ న్యాయవాది మహేశ్ తివారీపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఇచ్చిన ధిక్కార నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నన్నేం చేయగలరని హైకోర్టును పరోక్షంగా ప్రశ్నించేందుకే పిటిషన్ దాఖలు చేసినట్లు కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాలంటే చెప్పవచ్చని, లేకపోతే ధిక్కార ధోరణితో ముందుకు వస్తే తగిన విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అయితే న్యాయవాది క్షమాపణలు కోరితే వాటిని సహృదయంతో పరిగణించాలని ఝార్ఖండ్

2 లో..

### ధర్మాజీగూడెంలో 132/33

## కేవీ సబ్ స్టేషన్ ప్రారంభం



- లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- లక్ష మంది రైతులకు లబ్ధి

మన గళం, ఏలూరు : ఏలూరు జిల్లా, చింతలపూడి నియోజకవర్గంలోని ధర్మాజీగూడెంలో నూతనంగా నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహచర మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, జిల్లా ఎమ్మెల్యేలు మరియు ముఖ్య నాయకులతో కలిసి

2 లో..



## కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలి

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై ఇకపై మౌనం వీడాల్సిన అవసరం ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. అమరావతికి రాజధాని హోదా కల్పించడంలో కేంద్రం తాత్సారం చేస్తోందని, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు ఆపివేస్తూ వివక్ష చూపుతోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి మద్దతు కొనసాగించాల్సిన అవసరం లేదని, మద్దతు ఉపసంహరించుకోవడమే సరైన నిర్ణయమని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి ఆర్థికసాయం చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. విభజన హామీలు అమలు కాకపోవడంతో

2 లో..

### అఖిల కేరళ ధీవర సభ

## ప్రతినిధులతో మోదీ భేటీ



- కేరళ ప్రగతిపై విస్తృత చర్చ
- మత్స్యకారుల సంక్షేమానికి ప్రశంసలు
- మత్స్య రంగ అభివృద్ధికి కొనసాగనున్న కృషి

మన గళం, తిరువనంతపురం : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధి బృందంతో సానుకూలంగా భేటీ

2 లో..

### పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ విగ్రహావిష్కరణ



మన గళం, విజయవాడ : 60 వసంతాల ఏకాత్మ మానవ దర్శన పునఃస్మరణ జాతీయ సదస్సు సందర్భంగా విజయవాడ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పండిట్

2 లో..

## సీఎం పేషీ పేరుతో లక్షల వసూలు

### సీఎం పేషీలో పరిచయాలున్నాయంటూ నమ్మబలికిన నిందితులు



2 లో..

మన గళం, అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ముఠాలు రోజు రోజుకు పేట్రేగిపోతున్నాయి. ఏకంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పేషీ పేరునే వాడుకుంటూ లక్షలు దండుకున్న ఘటన అనకాపల్లి జిల్లాలో వెలుగు చూసింది. డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.12 లక్షలకు పైగా వసూలు చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, రోలుగుంట

## ముంచుకొస్తున్న మంచు తుఫాను..
# వణికిపోతున్న అమెరిక..!



ఇప్పటికే పలు రాష్ట్రాల గవర్నర్లు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మంచు బీభత్సంతో రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. పొగమంచు కారణంగా రహదారులు కనిపించక పలు ప్రాంతాల్లో వందకు పైగా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వేల సంఖ్యలో విమాన సేవలు రద్దు కావడంతో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు మైనస్ 45 డిగ్రీల వరకు పడిపోయాయి. బయటకు వస్తే కొద్ది నిమిషాల్లోనే చర్మం గడ్డకట్టే ప్రమాదం ఉండటంతో పలు నగరాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఈ తుఫాను ప్రభావం న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ, బోస్టన్ వంటి ఈశాన్య నగరాల్లో మరింత తీవ్రంగా ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు. అక్కడ దాదాపు ఒక అడుగు మేర మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భారీ హిమపాతం కారణంగా చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో వేలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరుతున్నారు.

# హైకోర్టు జడ్జితో సీనియర్ లాయర్ వాగ్వాదం..

హైకోర్టుకు సూచించారు. ఈ వివాదం ఓ విద్యుత్ బిల్లు కేసుతో ప్రారంభమైంది. ఝార్ఖండ్‌కు చెందిన ఓ మహిళకు 1.30 లక్షల మేర బకాయిలు ఉండటంతో అధికారులు విద్యుత్ కనెక్షన్ నిలిపివేశారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరగా మహిళ తరపున మహేశ్ తివారీ వాదనలు వినిపించారు. కనెక్షన్ పునరుద్ధరణ కోసం 25 వేలు చెల్లించేందుకు సిద్ధమని ఆయన కోర్టుకు తెలియజేశారు. అయితే గత తీర్పుల ప్రకారం కనీసం బకాయిలో సగం మొత్తాన్ని చెల్లించాల్సిందేనని న్యాయమూర్తి పేర్కొన్నారు. చివరకు 50 వేలు చెల్లించేందుకు అంగీకరించడంతో విషయం ఒక దశలో సర్దుబాటు అయ్యింది. అయితే వాదనలు వినిపించిన తీరు నచ్చకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్‌కు ఈ అంశంపై దృష్టి పెట్టాలని సూచించడంతో మహేశ్ తివారీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాను తన శైలిలోనే వాదనలు వినిపిస్తానని, ఎవరూ తనను అవమానించేలా వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేశారు. కోర్టు అన్యాయం చేస్తోందని మీరు అంటున్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, తాను అలా అనలేదని మహేశ్ వివరణ ఇచ్చారు. అవసరమైతే విచారణ రికార్డును పరిశీలించాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం మహేశ్ తివారీకి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

# అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధులతో మోదీ భేటీ

అయ్యారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ఈ సంస్థ చేస్తున్న సేవలను మోదీ ప్రశంసించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం అఖిల కేరళ ధీవర సభ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని మోదీ పేర్కొన్నారు. సముద్ర ఆధారిత జీవన విధానంపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తోందని మోదీ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో మత్స్య రంగ అభివృద్ధికి చర్యలు కొనసాగిస్తామని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ తెలిపారు.



# ఇప్పటినుంచే సిద్ధం కావాలి

తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, రవాణా, భద్రత వంటి అన్ని విభాగాల్లో సమన్వయంతో ఏర్పాట్లు జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సమీక్షకు ముందు ముఖ్యమంత్రికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. తన పాలనలో మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే అవకాశం రావడం తన అదృష్టమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సంబంధిత మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధర్మాజీగూడెంలో 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రారంభించారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని మంత్రి తెలిపారు. దాదాపు లక్ష మంది రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, గృహాలు, చిన్న పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ నాణ్యత మెరుగుపడుతుందని అధికారులు వివరించారు. ఏటా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, విద్యుత్ చార్జీలను తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు, రైతులపై విద్యుత్ భారం తగ్గిస్తూ అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ సబ్ స్టేషన్ ప్రారంభంతో చింతలపూడి నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మరింత బలపడనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# సీఎం పేషీ పేరుతో లక్షల వసూలు

మండలానికి చెందిన ఓ మహిళకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు మభ్యపెట్టారు. ప్రధాన నిందితుడు ప్రకాశం జిల్లా నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎర్రగొర్ల శ్రీను కాగా, విజయవాడకు చెందిన షేక్ సలీం అతనికి సహకరించాడు. సీఎం పేషీలో ఉన్నతాధికారులతో తనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయని చెప్పి, కచ్చితంగా ఉద్యోగం ఇప్పిస్తానని శ్రీను బాధితురాలిని నమ్మించాడు.

**– రూ.12 లక్షలకు పైగా నగదు వసూలు**

ఈ మాటలు నమ్మిన బాధితురాలినుంచి నిందితులు విడతలవారీగా రూ.12 లక్షలకు పైగా నగదు వసూలు చేసి మోసగించారు. ఉద్యోగం రాకపోవడంతో అనుమానం వచ్చిన మహిళ పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయటపడింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

**– పాత నేరస్తుడే ప్రధాన నిందితుడు: ఎస్పీ హెచ్చరిక**

ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, ప్రధాన నిందితుడు ఎర్రగొర్ల శ్రీను పాత నేరస్తుడని వెల్లడించారు. గతంలో కూడా ఎస్సై, లైన్‌మన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన చరిత్ర ఉందన్నారు. ఈ కేసులో ఇంకా బాధితులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్పీ సూచించారు.

# కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలి

పాటు, కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదని చెప్పారు. కేంద్రాన్ని పదే పదే అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో, రాష్ట్ర హక్కుల కోసం పోరాటమే మార్గమని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరగకముందే కేంద్ర ప్రభుత్వంతో తలపడాలని, ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే పేద ప్రజల ఉపాధిని నిర్వీర్యం చేసే జాతీయ ఉపాధి హామీ కొత్త చట్టానికి మద్దతు ఇవ్వడం దారుణమని షర్మిల విమర్శించారు. ఆ చట్టంతో రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం పడుతుందని, చివరికి నష్టపోయేది పేదలేనని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమ లక్ష్యంగా రాజకీయ నిర్ణయాలు ఉండాలని ఆమె స్పష్టం చేశారు.

# విజయవాడలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ విగ్రహావిష్కరణ

దీనదయాళ్ ఉపాధ్యాయ గారి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. దేశీయ తత్త్వచింతనకు దిశానిర్దేశం చేసిన మహనీయుడి ఆలోచనలకు నివాళిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తరపున నేతల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. బిజెపి జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ గారి త్యాగాలు, సిద్ధాంతాలను స్మరించారు. ఏకాత్మ మానవ దర్శనం సమాజ సమగ్రాభివృద్ధికి మార్గదర్శకమని వక్తలు పేర్కొన్నారు. సదస్సు ద్వారా జాతీయవాదం, సామాజిక సమన్వయం, సాంస్కృతిక విలువల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం యువతకు ప్రేరణగా నిలిచి, ఉపాధ్యాయ గారి ఆలోచనలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ఒక కీలక ఘట్టంగా నిలిచిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**– టెక్కలి నియోజకవర్గంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం**

మన గళం, కోటబొమ్మాళి : టెక్కలి నియోజకవర్గ పరిధిలోని కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చనాయుడు నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను మంత్రికి వినిపించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, సాగునీటి సౌకర్యాలు, స్థానిక మౌలిక వసతులకు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా అందినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడిన మంత్రి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత ఉండి ఒక్కరూ ప్రభుత్వ ఫలాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ స్పష్టమైన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి కష్టాల్లో తోడుగా నిలవడమే తన బాధ్యత అని మంత్రి కింజరాపు అచ్చనాయుడు అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



## నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంను నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





మన గళం బనగానపల్లె : బనగానపల్లె పట్టణం ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం ను నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి జిల్లా వైఎస్ఆర్ పార్టీ పరిశీలకురాలు కల్పలతా రెడ్డి వైఎస్సార్సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి వెంకటరమణ నియోజకవర్గ పరిశీలకుడు భూమా కిషోర్ కుమార్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి అవుకు మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పాల్గొన్న గుండం సూర్యప్రకాశ్ రెడ్డి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి గుండం నాగేశ్వరరెడ్డి అత్తర్ జాహీద్ హుస్సేన్ అబ్దుల్ ఖైర్ అంబటి రవికుమార్ రెడ్డి అనిల్ కునుకుంట్ల రామన్న సన్నల జనార్ధన్ రెడ్డి అబ్దుల్ ఫైజ్, బివి నాగార్జున రెడ్డి కోవెలకుంట్ల మండల పరిషత్ ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి వైస్ ఎంపీపీ షాజహాన్ వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వైఎస్ఆర్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం కష్టపడే వారికే గుర్తింపు పార్టీ పదవులు అలంకారప్రాయంగా లేకుండా పార్టీ కోసం పని చేయండి వైయస్సార్ పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కూటమి ప్రభుత్వంలో అధికారుల పనితీరు విడ్డూరంగా ఉంది కూటమి నాయకులకు వత్తాసు పలుకుతున్న అధికారులు జాగ్రత్త వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే ఉండదు కూటమి ప్రభుత్వంలో అరాచకపాలన కొనసాగుతుంది నాడు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన వారే నేడు బాధపడుతున్నారు వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైయస్ జగన్ 2.0 కాటసాని రామిరెడ్డి 2.0

## అన్న ప్రసాద వితరణ పథకానికి విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ ఎం. శివ నాగిరెడ్డి, తాడిపత్రి వారు ఈ రోజు ( 23.01.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,116/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాదుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

## కొలను భారతి క్షేత్రంలో వసంత పంచమి మహోత్సవం

**– శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన**

మనగళం శ్రీశైలం : నందికొట్కూరు గౌరవ శాసనసభ సభ్యులు గిత్త జయసూర్య ,శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, య , తెదేపా నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానంద రెడ్డి దంపతులు ,ధర్మకర్తల మండలి సభ్యులు గుండ్ల గంగమ్మ, చలివేరు కాశీనాథ్, చిట్టిబొట్ల భరద్వాజ శర్మ , రేఖగౌడ్ ,నరసింహరెడ్డి, వసంత పంచమి కార్యక్రమ ప్రత్యేక అధికారి ఫణీంద్ర ప్రసాద్, హరిదాసు, సతీష్ మాలిక్, సహాయ ప్రజాసంబంధాల అధికారి డా. శివారెడ్డి , దివాకర్ రెడ్డి, కార్తీక్ మరియు భక్తులు పాల్గొన్నారు.






## వ్యాపారులు తప్పక తెలుసుకోవాల్సిన కీలక నియమాలు..

హైదరాబాద్ ,23 జనవరి 2026,మనగళం : దేశంలో పన్ను వ్యవస్థలు, దిగుమతి ఎగుమతి విధానాలు వ్యాపార కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సరైన రిటర్న్ దాఖలు చేయకపోతే, చెల్లించిన పన్నుల లాభాన్ని వినియోగించుకోకపోతే, సరుకుల వర్గీకరణలో తప్పులు జరిగితే వ్యాపారులకు ఆర్థిక నష్టాలు, ఆలస్యాలు, వివాదాలు ఎదురయ్యే అవకాశం ఉంది. డిజిటల్ విధానాలు పెరిగినా, ప్రాథమిక నియమాలపై అవగాహన లేకుంటే అనుసరణ సమస్యలు తప్పవు. అందుకే వ్యాపారులు కొన్ని ముఖ్య విషయాలు తప్పక తెలుసుకోవాలి.వ్యాపార లావాదేవీల ఆధారంగా నెలవారీ, వార్షిక రిటర్న్‌ను గడువులోపు దాఖలు చేయాలి. ఆలస్యం అయితే ఆలస్య రుసుములు, వడ్డీ భారం పడుతుంది. అందుకే తేదీలను ముందుగానే ప్రణాళికలో పెట్టుకోవాలి. చెల్లించిన పన్నును తిరిగి లాభంగా వినియోగించుకోవాలంటే సరైన బిల్లులు ఉండాలి, సరఫరాదారులు కూడా సమయానికి రిటర్న్ దాఖలు చేసి ఉండాలి. లేకపోతే పన్ను భారం పెరుగుతుంది.

## వసంత పంచమి మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**– భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు – ఈ సంవత్సరం భక్తులకు ఉచిత దర్శనం – భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాల వితరణ**
**– పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం – కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు**



మనగళం శ్రీశైలం : శ్రీశైలదేవస్థాన దత్తత దేవాలయమైన కొలనుభారతీక్షేత్రంలో ఈ నెల 23వ తేదీన జరుగనున్న వసంత పంచమి మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు శ్రీశైలదేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరియు శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు సభ్యుల సలహాల సూచనల అనుగుణంగా ఆయా ఏర్పాట్లు చేయబడుతున్నాయన్నారు. ఈ నెల 10వ తేదీన నందికొట్కూరు నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య ఆధ్వర్యములో డివిజన్ స్థాయి అధికారుల సమన్వయ సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రభుత్వశాఖల అధికారులతో పాటు పలువురు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు కూడా పాల్గొనడం జరిగిందన్నారు. సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఆయా ఏర్పాట్లన్నీ చేయడం జరుగుతోందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా ఏర్పాట్లన్నింటిని కూడా పకడ్బందీగా చేపట్టడం జరిగిందన్నారు. గతంలో దర్శనానికి రూ. 5/-లు రుసుముగా ఉండేదన్నారు. ఈ సంవత్సరం భక్తులందరికీ కూడా ఉచిత దర్శనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం సహాయకార్యనిర్వహణాధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా పలువురు దేవస్థానం అధికారులకు, సిబ్బందికి కూడా ఉత్సవాల ప్రత్యేక విధులను కేటాయించడం జరిగిందన్నారు. ఉత్సవ నిర్వహణకు గాను ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి వారు కూడా తహశీల్దార్లకు, డిప్యూటీ తహశీల్దార్లకు, ఇతర రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారన్నారు. అదేవిధంగా ఆత్మకూరు డి.ఎస్.పి వారి ఆధ్వర్యములో రద్దీక్రమబద్ధీకరణ, వాహనాల క్రమబద్ధీకరణ మరియు భద్రతా చర్యలు చేపట్టబడుతున్నాయన్నారు. ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులు మంచినీటి సదుపాయ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు వారి సిబ్బంది పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. గోకవరం మండల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యములో ప్రాథమిక చికిత్స



కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. దాత సహకారంతో దేవస్థానం భక్తులకు ఉచితంగా అన్నప్రసాదవితరణను చేయడం జరుగుతోందన్నారు.ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. అన్నప్రసాదవితరణకు సంబంధించి దేవస్థానం దాతకు సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రణాళికబద్ధంగా క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భక్తులకు త్రాగునీరు అందించేందుకు కూడా ఆయా ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. వాహనాలరద్దీకనుగుణంగా పార్కింగ్ ఏర్పాట్లు చేయబడుతున్నాయన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు కూడా తగు చర్యలు తీసుకోబడుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేవిధంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. కాగా వసంతపంచమి రోజున ఉదయం గం. 4.00లకు ఆలయద్వారాలు తెరచి ప్రాత:కాల పూజాదికాలు జరుగుతాయన్నారు. వేకువజామున ఉదయం గం. 5.20లకు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించ బడుతాయన్నారు. ఉదయం గం. 6.00ల నుంచి భక్తులకు దర్శనాలు మరియు సామూహిక అక్షరాభాస్యాలు జరిపించబడుతాయన్నారు. మధ్యాహ్నం గం. 11.15లకు అమ్మవారి మధ్యాహ్నకాలపూజలు జరిపించబడుతాయన్నారు. తరువాత దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. సాయంకాలం గం. 6.00లకు



ప్రదోషకాలపూజలు, నివేదన, మహామంగళహారతుల అనంతరం రాత్రి గం. 7.00లకు ఆలయ ద్వారాలు మూసివేయబడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొలనుభారతిక్షేత్ర పరిసరాలలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. కాబట్టి భక్తుల ఈ విషయంపై దేవస్థానానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

## ఆదోని జిల్లా ఉద్యమం లో మేము సైతం

- 43 రోజు రిలే దీక్షల్లో ముస్లిం, మైనారిటీలు.
- నేడు ఆలూరు బంద్ కు జె ఏ సి పిలుపు.







(ఆలూరు మనగళం): వెనుకబాటుకు గురైన ఆలూరు ప్రాంతం విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని ముస్లిం మైనార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం ఆలూరు జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష 43వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో ముస్లిం, మైనారిటీలు దాదా కలంధర్, మహమ్మద్, షేక్ అహమ్మద్, రజాక్, ఎస్.ఎస్.వి వన్నూరు వలి, షేక్ష, దద్దు, షాశవల్లి, మున్నా, జాని, రఫీక్, అహద్, కో ఆప్షన్ సభ్యులు భాష మున్నా, ముజాహిద్, సలాం కూర్చున్నారు. జెఏసి నాయకులు కత్తి రామాంజినేయులు, భూపేష్, ఎల్లప్ప, చంద్రజంత్ రెడ్డి, కొట్టాల రాజు, పూల రామాంజినేయులు మాట్లాడుతూ శనివారం తలపెట్టిన 5 నియోజకవర్గాల బంద్ ను అన్ని వర్గాలు పాటించాలన్నారు. ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (23.01.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది.కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాజ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజ జరిపించబడింది. ఆ తరువాత లోక కల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరి ద్రోదకం, కుంకు మోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేష అభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## నందవరంలో ఘనంగా మంత్రివర్యులు నారాలోకేష్ గారి జన్మదిన వేడుకలు





నందవరం జనవరి 23 మనగళం న్యూస్ : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు నందవరం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కాశీంవలి ఆధ్వర్యంలో మంత్రి వర్యులు నారా లోకేష్ గారి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు కేట్ కట్ చేసి, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నందవరం మండల అధ్యక్షులు కాశీంవలి మాట్లాడుతూడ. ఎన్నో అవమానాలను, అవరోధాలను ఎదుర్కొని యువగళం పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారన్నారు. ఏపీలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు అనేక కంపెనీలను ఒప్పించి పరిశ్రమలను తీసుకురావడంలో లోకేష్ పాత్ర అభినందనీయమని అన్నారు. తాత స్వర్గీయ నందమూరి తారకరామారావు గారితో పాటు తండ్రి గారైన సీఎం నారా చంద్రబాబు నాయుడు గారికి తగ్గ తనయుడిగా తనదైన శైలిలో పార్టీని, పాలనను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న మంత్రి నారా లోకేష్ గారికి నందవరం మండలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నందవరం మండల పరిధిలో గల అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, ప్రజలు పాల్గొనడం జరిగింది.

## సోనీ టీసీఎల్‌తో సంచలన భాగస్వామ్యం..

న్యూఢిల్లీ జనవరి 23 మనగళం : అంతర్జాతీయ టీవీ, హోమ్ ఆడియో ఉత్పత్తుల మార్కెట్‌లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. జపాన్ కేంద్రంగా పనిచేసే వినియోగ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ, చైనా కేంద్రంగా ఉన్న టీసీఎల్ కలిసి ఒక సంయుక్త సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందంపై ఇప్పటికే ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. ఈ సంయుక్త సంస్థలో టీసీఎల్‌కు 51 శాతం వాటా ఉండగా, సోనీకి 49 శాతం వాటా ఉంటుంది. ఈ భాగస్వామ్యం ద్వారా తయారయ్యే టీవీలు, హోమ్ ఆడియో పరికరాలు సోనీ మరియు బ్రావియా బ్రాండ్ పేర్లతోనే మార్కెట్‌లో విక్రయించనున్నారు. పెట్టుబడుల పరిమాణానికి సంబంధించిన పూర్తి వివరాలను కంపెనీలు ఇంకా వెల్లడించలేదు. అయితే సోనీ బ్రాండ్ బలాన్ని వినియోగించుకుని అంతర్జాతీయ మార్కెట్‌లో తన అమ్మకాలను మరింత పెంచుకోవాలనే లక్ష్యంతో టీసీఎల్ ఈ సంయుక్త సంస్థకు ముందుకు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ భాగస్వామ్యం ద్వారా నాణ్యమైన సాంకేతికత, ఆధునిక డిజైన్‌తో కొత్త ఉత్పత్తులు వినియోగదారుల ముందుకు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కొండాపురం గ్రామ పార్టీ కార్యకర్తలకు ఉచిత కంటి ఆపరేషన్లు



మన గళం కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గం సి.బెలగల్ మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన వైయస్ఆర్‌సీపీ పార్టీ కార్యకర్తలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. కోడుమూరు నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రత్యేక చొరవతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారుగ్రామంలో పేదరికం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి చికిత్స పొందలేని కార్యకర్తల సమస్యలను గుర్తించిన డా. సతీష్, తక్షణమే వైద్య సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన సమన్వయంతో అర్హులైన కార్యకర్తలను ఆస్పత్రికి తరలించి, నిపుణులచే విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించారు.ఈ సందర్భంగా డా. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తల ఆరోగ్యం తమకు అత్యంత ముఖ్యమని అన్నారు. అవసరమైన ప్రతి సమయంలో కార్యకర్తలకు అండగా నిలబడటమే తన బాధ్యతగా పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కంటి ఆపరేషన్లు పొందిన కార్యకర్తలు డా. సతీష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ ఆరోగ్యంపై ఆయన చూపుతున్న శ్రద్ధను అభినందించారు. వారి తో పాటు కోడుమూరు నియోజకవర్గం ఎంప్లాయిస్ మరియు పింఛన్ విభాగం అధ్యక్షులు రామకృష్ణ యాదవ్, సుభాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ




మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (23.01.2026 ) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామి అమ్మ వార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది.ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మ వార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## విద్యే ప్రపంచ భవిష్యత్తు

విద్య అనేది ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే మార్చే సాధనం కాదు. అది కుటుంబాలను, సమాజాలను, దేశాలను, చివరికి ప్రపంచాన్నే మార్చే శక్తివంతమైన మార్గం. ప్రపంచవ్యాప్తంగా శాంతి భద్రతలు దెబ్బతింటున్న వేళ, అసమానతలు పెరుగుతున్న వేళ, అభివృద్ధి కొద్ది మందికే పరిమితమవుతున్న పరిస్థితుల్లో విద్య పాత్ర మరింత కీలకంగా మారింది. విద్య ద్వారా శాంతి, అభివృద్ధి, సమానత్వం సాధ్యమవుతుందనే భావనను ప్రపంచానికి గుర్తు చేయడానికే అంతర్జాతీయ విద్యా దినోత్సవం ఒక బలమైన వేదికగా నిలుస్తోంది.

శాంతి అనేది యుద్ధాలు లేకపోవడమే కాదు. సమాజంలో పరస్పర గౌరవం, సహనం, అవగాహన ఉన్నప్పుడే నిజమైన శాంతి ఏర్పడుతుంది. అజ్ఞానం ద్వేషానికి దారి తీస్తే, జ్ఞానం అవగాహనకు దారితీస్తుంది. చదువు లేని చోట వదంతులు నిజాలుగా మారుతాయి. చదువున్న చోట ప్రశ్నలు పుడతాయి. ఇతరుల అభిప్రాయాలను వినే సంస్కారం విద్య ద్వారానే వస్తుంది. అందుకే ప్రపంచంలోని చాలా సంఘర్షణలకు మూలకారణం అజ్ఞానమేనని చెప్పాల్సి వస్తోంది. శాంతి కోసం ఆయుధాలపై ఖర్చు చేసే దానికన్నా, విద్యపై పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయి.

అభివృద్ధి అనే మాటను చాలా సార్లు రహదారులు, భవనాలు, పరిశ్రమలతో మాత్రమే కొలుస్తాం. కానీ నిజమైన అభివృద్ధి మనుషుల ఆలోచనల్లో కనిపించాలి. ఆలోచించే శక్తి, సమస్యలను గుర్తించే సామర్థ్యం, పరిష్కారాలను వెతికే దృక్పథం  ఇవన్నీ విద్య వల్లనే వస్తాయి. నాణ్యమైన విద్య పొందిన యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసేవారిగా కాకుండా, ఉద్యోగాలు సృష్టించేవారిగా మారతారు. పరిశోధన, ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధి అన్నీ చదువు బలంగా ఉన్న సమాజంలోనే వికసిస్తాయి. అందుకే అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే విద్య వ్యవస్థను బలోపేతం చేయడం అనివార్యం.

సమానత్వం అనే భావన విద్య లేకుండా ఊహించలేం. ఒక బాలుడు పుట్టిన పరిస్థితులే అతని భవిష్యత్తును నిర్ణయిస్తే అది సమాజ వైఫల్యం. విద్య అందరికీ సమానంగా అందినప్పుడే పేదరికం అనే గొలుసు తెగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, పట్టణాల్లోని పిల్లలు ఒకే స్థాయిలో పోటీ పడగలగాలి. బాలికల విద్యను నిర్లక్ష్యం చేసే సమాజం అర్ధసమాజాన్నే వెనక్కి నెట్టినట్టే. అందుకే బాలికల విద్య, దివ్యాంగుల విద్య, వెనుకబడిన వర్గాల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం మరింత ఎక్కువగా ఉంది.

నాణ్యమైన విద్య అంటే పుస్తకాలు మాత్రమే కాదు. ఆలోచనలను పెంచే బోధనా విధానాలు, ప్రశ్నించేందుకు ప్రోత్సహించే ఉపాధ్యాయులు, జీవితానికి ఉపయోగపడే నైపుణ్యాలు  ఇవన్నీ కలిసి ఉన్నప్పుడే విద్య అర్థవంతమవుతుంది. కేవలం పరీక్షలకే పరిమితమైన చదువు, మార్కుల కోసం జరిగే పోటీ యువతపై మానసిక ఒత్తిడిని పెంచుతోంది. విద్య మనిషిని ఉద్యోగ యంత్రంగా కాకుండా, బాధ్యతాయుత పౌరుడిగా తీర్చిదిద్దాలి. విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలు కూడా విద్యలో భాగం కావాలి.

ఈ అంతర్జాతీయ విద్యా దినోత్సవం మనందరికీ ఒక ప్రశ్న వేస్తోంది. మనం పిల్లలకు నిజంగా ఏ రకమైన విద్య ఇస్తున్నాం? భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా వారికి సిద్ధం చేస్తున్నామా? లేక కేవలం సిలబస్ పూర్తి చేయడానికే పరిమితమవుతున్నామా? విద్యను ఖర్చుగా చూడకుండా, భవిష్యత్తుకు పెట్టుబడిగా చూడాల్సిన సమయం ఇది. ప్రభుత్వాలు, సమాజం, తల్లిదండ్రులు  అందరూ కలిసి విద్యను కేంద్రంగా పెట్టుకొని ఆలోచించాల్సిన అవసరం ఉంది.

చివరికి చెప్పాలంటే, విద్యే శాంతికి మార్గం, అభివృద్ధికి మూలం, సమానత్వానికి పునాది. చదువుకున్న ప్రపంచం మాత్రమే నిజంగా ముందుకు సాగగలదు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం ఒక రోజు మాత్రమే గుర్తు చేసే విషయం కాదు. ఇది ప్రతి రోజు మన ఆలోచనల్లో, విధానాల్లో, చర్యల్లో కనిపించాల్సిన విలువ. విద్య బలంగా ఉన్న సమాజమే భవిష్యత్తును ధైర్యంగా ఎదుర్కొనగలదు.  అభివృద్ధి అనే మాట ఆర్థిక వృద్ధితో మాత్రమే పరిమితం కాదు. మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆవిష్కరణలు  ఇవన్నీ విద్య నుంచే పుడతాయి. ఒక దేశం ముందుకు సాగాలంటే రహదారులు, భవనాలు మాత్రమే కాదు, ఆలోచించే మెదళ్లు కావాలి. నాణ్యమైన విద్య లభించిన యువత కొత్త ఆలోచనలను తీసుకువస్తారు, సమాజ సమస్యలకు పరిష్కారాలు సూచిస్తారు. అందుకే అభివృద్ధికి పునాది విద్యనే అని ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి.

సమానత్వం అనే భావన కూడా విద్యతోనే సాధ్యం. చదువు లేని స్థితిలో పేదరికం తరతరాలకు బదిలీ అవుతుంది. విద్య ఉన్నచోట అవకాశాలు పెరుగుతాయి. ఒక బాలుడు, ఒక బాలిక ఏ కుటుంబంలో పుట్టారనే అంశం వారి భవిష్యత్తును నిర్ణయించకుండా ఉండాలంటే నాణ్యమైన విద్య అందరికీ అందాలి. గ్రామం అయినా, పట్టణం అయినా, ధనికుడైనా, పేదవాడైనా  విద్యలో సమాన అవకాశం కలిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఈ అంతర్జాతీయ విద్యా దినోత్సవం మనకు ఒక బాధ్యతను గుర్తు చేస్తోంది. విద్యను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. పాఠశాలలు, ఉపాధ్యాయులు, బోధనా విధానాలు, మౌలిక సదుపాయాలు  అన్నింటినీ బలోపేతం చేయాలి. చదువు మధ్యలోనే ఆగిపోయే పిల్లల సంఖ్యను తగ్గించాలి. విద్యను జీవనోపాధికి మాత్రమే కాకుండా జీవన విలువలకు మార్గంగా తీర్చిదిద్దాలి. అప్పుడే విద్య ద్వారా శాంతి, అభివృద్ధి, సమానత్వం అనే లక్ష్యాలు నిజంగా సాధ్యమవుతాయి.

# రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు

**– డ్రైనేజీ కాలువలకు భూమి పూజ : ఎమ్మెల్యే కోట్ల**





మన గళండోన్ పట్టణంలోని 32వ వార్డు శ్రీనివాస నగర్ లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ కాలువల నిర్మాణ పనులకు డోన్ శాసనసభ్యులు  కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి  భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే  మాట్లాడుతూ, డోన్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శ్రీనివాస నగర్ లో సీసీ రోడ్డు, సీసీ కాలువల నిర్మాణంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తొలగి, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా మరియు పరిశుభ్రమైన పరిసరాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ 43వ జన్మదిన వేడుకలు

**– ఎమ్మిగనూరులో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు..**





కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు భాస్కర్ల చంద్రశేఖర ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు స్థానిక ఎమ్మెల్యే ఇంట్లో ముందుగా కేక్ కట్ చేసి శుభకాంక్షలు తెలియజేశారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు బెడ్లు పంపిణీ చేశారు అదేవిధంగా పట్నంలోని ఓ అనాధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. పట్టణ శివారు ప్రాంతంలోని కొద్ది మంది నిరుపేదలకు దుస్తులు దుప్పట్లు వంటి నిత్యవసర అవసరాలను అందజేశారు..కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందినఅనాధకు అంత్యక్రియలు





మన గళండోన్ పట్టణ సమీపంలో రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర మొన్న చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తి  చనిపోయాడు  తన దగ్గర ఎటువంటి ఆధార్ కార్డు గాని తనకు సంబంధించిన గుర్తింపు పేపర్లు గాని లేనందువలన తను ఒక అనాధ యాచకుడు అని గుర్తించి మృతదేహానికి అంత్యక్రియలు చేయమని డోన్ రూరల్ సి.ఐ రాకేష్ ద్రోణాచలం సేవాసమితి వారికి కోరగా చనిపోయిన వ్యక్తి గురించి రూరల్ సి.ఐ రాకేష్ కి తెలిపి చనిపోయిన యాచకుడికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ పుణ్య కార్యక్రమమునకు అయిన ఖర్చు మొత్తం ప్రొద్దుటూరుకు చెందిన కీర్తిశేషులు పై నారాయణ రెడ్డి  కుమారుడు చరణ్ తేజ్ రెడ్డి  లి భరించారు. ఈ కార్యక్రమం లో ద్రోణాచలం సేవా సైనికులు ఆత్మబంధు టీం సభ్యులు గురుస్వామి షాధిఖాన రాజా మరియు డోన్ రూరల్ ఏ. ఎస్ ఐ.గౌస్ మోహిద్దిన్, ప్రసాద్ పాల్గొన్నారు.

# భాజపా సదస్సులో బీజేపీ సీనియర్ నాయకులు

మనగళం : పెద్ద దోర్నాల మండలం: జన సంఘ్ జాతీయ మహాసభలు నిర్వహించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, విజయవాడలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు దోర్నాల మండల బీజేపీ సీనియర్ నాయకులు సురవరం వీరా రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా, జన సంఘ్ జాతీయ మహాసభలో పాల్గొన్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిను సురవరం వీరా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, జన సంఘ్ చరిత్ర, దేశాభివృద్ధిలో పార్టీ పాత్రపై చర్చ జరిగినట్లు తెలిపారు. పార్టీ ఆలోచనాధారాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహించినట్లు భాజపా నాయకులు పేర్కొన్నారు.



## మళ్లీ కుప్పకూలిన సూచీలు.




న్యూఢిల్లీ 23-01-2026 మనగళం, వరుస నష్టాల నుంచి గురువారం స్వల్పంగా కోలుకున్న దేశీయ షేర్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. విదేశీ పెట్టుబడిదారులు గురువారం 2549 కోట్ల రూపాయల విలువైన షేర్లను అమ్మేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయికి పడిపోవడం, ముడిచమురు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు కనిపించడం కూడా సూచీలను వెనక్కి లాగాయి. ముఖ్యంగా అదానీ గ్రూప్‌కు చెందిన హెవీవెయిట్ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో మార్కెట్‌లో భయాందోళనలు నెలకొన్నాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు తొలుత లాభాల్లో కొనసాగాయి. ఒక దశలో సెన్సెక్స్ సుమారు 200 పాయింట్లు లాభపడి 82516 స్థాయికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు పెరగడంతో మార్కెట్ ఒక్కసారిగా పతనమైంది. చివరకు సెన్సెక్స్ 769 పాయింట్లు నష్టపోయి 81537 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా అదే దిశలో కదలాడుతూ 241 పాయింట్లు తగ్గి 25048 వద్ద స్థిరపడింది. గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులపై విదేశీ నియంత్రణ సంస్థలు విచారణకు అనుమతి కోరిన వార్తలు రావడంతో అదానీ గ్రూప్ షేర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు భారీగా పడిపోయాయి. మరోవైపు కొన్ని బ్యాంకింగ్, మెటల్ రంగాల షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్ సూచీ భారీగా నష్టపోగా, మధ్యతరహా షేర్ల సూచీ కూడా పెద్దగా తగ్గింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 91.94 వద్ద కొనసాగింది. మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అమెజాన్‌లో 14000 మందికి షాక్..




హైదరాబాద్ 23 జనవరి, మనగళం: దిగ్గజ ఈకామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి ఉద్యోగులకు పెద్ద షాక్ ఇచ్చింది. వరుసగా ఉద్యోగాల తొలగింపు కొనసాగుతుండగా, ఈసారి సుమారు 14000 మందిని తొలగించే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం వెల్లడించింది. ఇప్పటికే గతేడాది పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను తగ్గించిన సంస్థ, ఈ ఏడాదిలో కూడా అదే బాటలో ముందుకు సాగుతుండటంతో ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది.ఈ తొలగింపుల ప్రభావం క్లౌడ్ సేవలు, ఆన్‌లైన్ విక్రయాలు, వినోద విభాగం, మానవ వనరుల విభాగాలపై ఎక్కువగా పడనున్నట్లు తెలుస్తోంది. ఈ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులే ప్రధానంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా మొత్తం 30000 ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికలో సంస్థ ఉందనే ప్రచారం సాగుతుండగా, తాజా పరిణామాలు ఆ ఊహలను మరింత బలపరుస్తున్నాయి.

సంస్థ యాజమాన్యం మాత్రం ఈ నిర్ణయాన్ని ఆర్థిక ఇబ్బందులతోనో, కృత్రిమ మేధ ప్రభావంతోనో అనుసంధానం చేయడం లేదని చెబుతోంది. సంస్థలో ప్రతి సంవత్సరం కొత్త ఉద్యోగులను నియమిస్తూనే ఉంటామని, అదే సమయంలో అవసరాన్ని బట్టి ఉద్యోగుల సంఖ్యను సమతుల్యం చేయాల్సి వస్తుందని వివరణ ఇచ్చింది. ఇది సంస్థలో సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది.గత 2022 సంవత్సరంలో ఒక్కసారిగా 27000 మందిని తొలగించడం ద్వారా సంస్థ సంచలనం సృష్టించింది. ఆ తర్వాత కూడా ప్రతి ఏడాది వేల సంఖ్యలో ఉద్యోగాలు తగ్గుతూనే ఉన్నాయి. ఈసారి మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉండటంతో, సంస్థలో పనిచేస్తున్న వారిలో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. ఉద్యోగ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ, ఈ నిర్ణయం కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది.

## వారెవ్వా..! ఆపిల్ కొత్త ఫోన్ల లాంచ్‌లో భారీ ట్విస్ట్.. ధరలు ఆకాశానికి..!!




హైదరాబాద్ 23-01-2026 , మనగళం : ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్ ఫోన్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ కొత్త ఫోన్ల శ్రేణిలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నట్లు సమాచారం. ఈసారి ఫోన్ల ధరలు గణనీయంగా పెరగడంతో పాటు విడుదల షెడ్యూల్‌లోనూ పెద్ద మార్పులు ఉండే అవకాశముందని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా అధిక సౌకర్యాలు కలిగిన ప్రీమియం మోడళ్లను కొనాలనుకునే వినియోగదారులకు ఖర్చు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, కృత్రిమ మేధస్సు సర్వర్లు మరియు డేటా కేంద్రాలకు భాగాల డిమాండ్ ఎక్కువ కావడంతో చిప్‌ల కొరత ఏర్పడటం ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. కొత్త ప్రాసెసర్ తయారీ ఖర్చు కూడా కంపెనీపై అదనపు భారం మోపుతోందని తెలుస్తోంది. మరోవైపు సాధారణ మోడల్ ధరలో పెద్ద మార్పు ఉండకపోయినా, ఈసారి అన్ని మోడళ్లను ఒకేసారి విడుదల చేసే సంప్రదాయం ఉండకపోవచ్చని అంచనా. 2026లో కేవలం ప్రీమియం మోడళ్లతో పాటు మడత ఫోన్ మాత్రమే విడుదల చేసి, సాధారణ మోడల్‌ను 2027లో అందుబాటులోకి తీసుకురావచ్చని సమాచారం. దీని ప్రభావం భారత మార్కెట్‌పై కూడా పడే అవకాశం ఉంది. ఎందుకంటే భారత్‌లో మధ్య స్థాయి ధరల ఫోన్లకు ఎక్కువ డిమాండ్ ఉండటంతో, ధరలు పెరిగితే అమ్మకాలపై ప్రభావం పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే కొత్త ఫోన్ కొనాలనుకునే వారు ఇప్పటినుంచే పొదుపు మొదలుపెట్టాలని, లేదంటే మరో ఏడాది ఓపిక పట్టాల్సి రావచ్చని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రతి నెలా మీ చేతికి 9250.. ఒక్కసారి పెట్టుబడితో అద్భుత ఆదాయం..




న్యూఢిల్లీ 23 జనవరి 2026 : మనగళం, నేటి కాలంలో పెట్టుబడి పెట్టేటప్పుడు భద్రతతో పాటు స్థిరమైన ఆదాయం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన వారు, గృహిణులు తమ వద్ద ఉన్న డబ్బును సురక్షితంగా ఉంచి నెలవారీ ఆదాయం పొందాలని ఆశిస్తున్నారు. అలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ పథకమే తపాలా కార్యాలయ నెలవారీ ఆదాయ పథకం.

ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 7.4 శాతం వడ్డీ ఇస్తోంది. భార్యాభర్తలు లేదా ముగ్గురు పెద్దలు కలిసి సంయుక్త ఖాతా తెరవచ్చు. ఈ ఖాతాలో గరిష్టంగా 15 లక్షలు జమ చేయవచ్చు. 15 లక్షల పెట్టుబడిపై ఏడాదికి సుమారు 111000 వడ్డీ వస్తుంది. దీనిని 12 నెలలకు విభజిస్తే ప్రతి నెలా సుమారు 9250 మీ చేతికి వస్తుంది. ఒకే వ్యక్తి ఖాతా తెరిస్తే గరిష్టంగా 9 లక్షలు జమ చేయవచ్చు. దీని ద్వారా నెలకు సుమారు 5550 వడ్డీ రూపంలో లభిస్తుంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ భరోసాతో నడిచే విధానం కావడంతో మీ అసలు సొమ్ముకు ఎలాంటి ప్రమాదం ఉండదు. పథకం కాలపరిమితి 5 సంవత్సరాలు. మెచ్యూరిటీ పూర్తయ్యాక మళ్లీ కొనసాగించుకునే అవకాశం ఉంటుంది. 18 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులు ఎవరైనా ఖాతా తెరవవచ్చు. పిల్లల పేర మీద కూడా తల్లిదండ్రులు పెట్టుబడి పెట్టవచ్చు. దేశంలోని ఏ తపాలా కార్యాలయానికి అయినా ఖాతాను సులభంగా బదిలీ చేసుకునే వెసులుబాటు ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ముందుగానే డబ్బు తీసుకోవాలంటే కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. ఖాతా తెరిచిన మొదటి ఏడాదిలో డబ్బు తీసుకునే అవకాశం ఉండదు. 1 నుంచి 3 సంవత్సరాల మధ్య తీసుకుంటే అసలు మొత్తంలో 2 శాతం జరిమానా కోత విధిస్తారు. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య తీసుకుంటే 1 శాతం కోత ఉంటుంది. మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఈ పథకం భద్రమైన మార్గంగా మారుతోంది.

## స్మార్ట్‌ఫోన్ చరిత్రలో సంచలనం.. బాహుబలి బ్యాటరీతో కొత్త ఫోన్ దూసుకురావా..!



హైదరాబాద్, 23 జనవరి 2026 ,మనగళం: స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను ఎక్కువగా వేధించే సమస్య చార్జ్ త్వరగా అయిపోవడం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా భారీ శక్తి నిల్వ సామర్థ్యంతో కొత్త ఫోన్ భారత మార్కెట్లోకి రాబోతోంది. పరిశ్రమలోనే తొలిసారిగా 10001 సామర్థ్యంతో రూపొందించిన ఈ ఫోన్ ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే ఎక్కువ రోజుల పాటు పనిచేసేలా తయారు చేశారు. ప్రయాణాలు చేసే వారు, వీడియోలు చూసేవారు, ఆటలు ఆడేవారికి ఇది పెద్ద ఊరటగా మారనుంది.భారీ సామర్థ్యం ఉన్నప్పటికీ ఈ ఫోన్ మందంగా కాకుండా సన్నగా, తేలికగా ఉండేలా ఆధునిక సాంకేతికతను వినియోగించారు. దీని వల్ల చేతిలో పట్టుకోవడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు దీర్ఘకాలం ఉపయోగించినా అలసట ఉండదు. బలమైన నిర్మాణంతో తయారైన ఈ ఫోన్ పడిపోయినా దెబ్బలు తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంది. తీవ్రమైన చలి, ఎక్కువ వేడి వంటి పరిస్థితుల్లో కూడా స్థిరంగా పనిచేసేలా ప్రత్యేక రక్షణ వ్యవస్థను అందించారు.

మరొక ముఖ్యమైన అంశం దీర్ఘకాలిక మన్నిక. నాలుగు సంవత్సరాల నిరంతర వినియోగం తర్వాత కూడా శక్తి నిల్వ సామర్థ్యం 80 శాతం కంటే ఎక్కువగా ఉండేలా రూపొందించారు. దీని వల్ల తరచూ ఫోన్ మారాల్సిన అవసరం తగ్గి వినియోగదారులకు ఆర్థికంగా కూడా లాభం చేకూరుతుంది. పవర్ బ్యాంక్ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా ఫోన్ వాడుకునేలా ఈ కొత్త మోడల్ రూపొందించబడింది. జనవరి 29 నుంచి ఈ ఫోన్ మార్కెట్లో అందుబాటులోకి రానుంది. భారీ శక్తి నిల్వ, సన్నని ఆకృతి, భద్రత, మన్నిక వంటి అంశాలతో ఈ ఫోన్ వినియోగదారుల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకురానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఘనంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు

**- బడి పిల్లలకు ఎగ్జామ్ పాడ్లు, పలకాలు, పెన్నులు ప్రధానం చేసిన నాయకులు.**






( ఆలూరు మనగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆస్పరి మండలం టిడిపి యువ నాయకులు మేకల రంగనాథ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నారా లోకేష్ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మరియు పరీక్ష సామాగ్రి అందజేశారు. అలాగే ఆస్పరి మండలంలో కేంద్రం అంగనవాడి 5 కేంద్రాల నందు సరస్వతి వాసంతి పంచమి పూజ సందర్భంగా బడి పిల్లలకు (స్లేట్స్) పలకాలు యువ నాయకుడు మేకల రంగనాథ్, మహేష్ మరియు ఓబులేష్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువ నాయకులు ఓబులేష్, నరసింహ, మంజునాథ్ ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

శనివారం
24 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# క్రికెట్ పోటీలు ప్రారంభించిన సర్పంచ్ భాగ్యరత్న, కోడుమూరు ఎస్. ఐ. డి.వై .స్వామి.

మన గళం కోడుమూరు: కోడుమూరులో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి తిరునాళ్ల సందర్భంగా కోడుమూరు పట్టణంలోని శ్రీ రామచంద్ర టాకీస్ వారి గ్రౌండ్ నందు కోడుమూరు తాలూకా క్రికెట్ అసోసియేషన్ తరపున నిర్వహించిన క్రికెట్ పోటీల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భాగ్యరత్న మరియు కోడుమూరు సబ్ ఇన్స్పెక్టర్ డి.వై. స్వామి మరియు కోడుమూరు తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రఘురామిరెడ్డి విశ్వహిందూ పరిషత్ కోడుమూరు అధ్యక్షులు నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు అలాగే ఈ కార్యక్రమంలో మన ఊరు మన జాతర సంబంధించిన కమిటీ , కోడుమూరు గ్రామీణ అభివృద్ధి కమిటీ కోడుమూరు పట్టణంలోని పలు పెద్ద మనుషులు , ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని క్రికెట్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యరత్న మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో చౌడేశ్వరి మాత తిరుణాల సందర్భంగా పట్టణంలోని పెద్దలంతా కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు కోడుమూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ డి.వై. స్వామి మాట్లాడుతూ ఇప్పుడున్న కాలంలో పిల్లలు ఆన్లైన్ గేమ్లలో సమయాన్ని వేస్ట్ చేసుకుంటున్నారు అని ప్రత్యక్షంగా ఫిజికల్ యాక్టివిటీస్ లో భాగంగా ఇలాంటి ఓపెన్ డోర్ గేమ్స్ ని ఆడి వారి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఈ విధంగా ప్రత్యక్షంగా అవుట్డోర్ గేమ్స్ ఆడటం వలన వారి శరీరానికి కేలరీలు కరగడమే కాకుండా మరియు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తూ ఆరోగ్యంగా ఉండాలంటే సుఖమైన నిద్ర అవసరం అలాంటి నిద్రను పొందాలంటే ఈ విధమైనటువంటి క్రీడల నుంచి అలసట ద్వారా నాణ్యమైన నిద్రను పొంది ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలియజేశారు కోడుమూరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అయినటువంటి డాక్టర్ రఘురామిరెడ్డి క్రీడలు ఎంతో మనిషి జీవితంలో అవసరమని గత కొన్ని సంవత్సరాలుగా కోడుమూరు క్రికెట్ అసోసియేషన్ తరపు నుంచి ఎంతోమంది క్రీడాకారులను తయారు చేసి నేషనల్ ఇంటర్నేషనల్ స్థాయికి బాలురను బాలికలను ఉన్నత శిఖరాలకు చేర్చి వారి జీవితాన్ని నిలబెట్టిన ఘనత కోడుమూరు తాలూకా క్రికెట్ అసోసియేషన్ కి చెందుతుందని ఈ అసోసియేషన్ కి అధ్యక్షులు అయినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందని ఆశ వ్యక్తం చేశారు అలాగే గత కొన్ని సంవత్సరాలుగా ఈ క్రికెట్ టోర్నమెంట్ చౌడేశ్వరి జాతరకు ముందుగానే 10 రోజుల ముందుగానే ఈ క్రికెట్ టోర్నమెంట్ ని జరపడం ఈ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమం జాతరలో నిర్వహించే అన్ని కార్యక్రమాలలో కంటే ముందుగానే ఈ కార్యక్రమాన్ని 10 రోజుల జాతరగా జరుగుతుందని ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహించిన కోడుమూరు గ్రామీణ అభివృద్ధి క్రీడలు కార్యక్రమాల సమితి సభ్యుల అందరికీ ఈ కార్యక్రమాన్ని నిలపడానికి కృషి చేసిన ప్రతి ఒక్క సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు అలాగే ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ మొదలుకొని పట్టణంలో ఎన్నో క్రీడా కార్యక్రమాలు ఉత్సాహంగా అందరు పెద్దమనుషులను కలుపుకొని అన్ని రంగాల వారిని కలుపుకొని అన్ని గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులను కలుపుకొని నిర్వహించే క్రీడలు కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఉంటాయని కోడుమూరు చౌడేశ్వరి దేవి తిరునాళ్ల ఘనతను తెలియజేస్తుందని కోడుమూరు తాలూకా క్రికెట్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు రఘురాం రెడ్డి జాయింట్ సెక్రటరీ







దస్తగిరి మరియు కమిటీ సభ్యులు అందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు అలాగే లాయర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ క్రీడలు అనేవి భావితరాలకు ఎంతో నూతన ఉత్సవాన్ని ఇస్తాయని కాబట్టి ఇటువంటి కార్యక్రమాలు మన ఊరు ప్రజలంతా కలిసి ఎంతో సంబరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆంధ్రయ్య, కే డి సి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ షాకీర్ అహమ్మద్ జయన్న , కృష్ణయ్య, దయాకర్ బిజెపి సల్వాడి సురేంద్ర శంకర్ వైసిపి కౌన్సిలర్ ప్రతాపరెడ్డి ఆర్ఎస్ఎస్ సభ్యుల అశోక్ టిడిపి సభ్యులు బాలకిట్టు బుగుడే శ్రీనివాసులు నాగరాజు మరియు పట్టణంలోని పలు సంఘాల నాయకులు పెద్దమనుషులు మరియు పలు గ్రామాల పెద్దమనుషులు మరియు క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆలూరులో ఘనంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు

**– భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించిన వైకుంఠం జ్యోతి**





(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి మరియు రాష్ట్ర కార్యనిర్వాహకం కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ప్రజలలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ రోజురోజుకి పెరుగుతుంది అన్నారు. ఒకరోజు విడిచి ఒకరోజు ప్రగ్రామ్స్ ఉన్నాకూడా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అలసిపోకుండా చాలా ఉత్సహంతో మేము పిలిచిన వెంటనే వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు టీడీపీ కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరికి పాదాభివందనం తెలిపారు. టీడీపీ పార్టీలో ఉంటూనే మేము ఎన్నో ఇబ్బందులకు, అవమానాలకు గురియ్యము అన్నారు. ఇప్పుడు వైకుంఠం కుటుంబంపై నమ్మకంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు మాకు అవకాశం కల్పించారు. ప్రతి ఒక్క టీడీపీ నాయకులను, కార్యకర్తను కలుపుకొని పోతాము అన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు తలెత్తితే కూర్చొని మాట్లాడి పరస్కరించుకుందాం అని టీడీపీ శ్రేణులకు హామీ ఇచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయ డంకా మోగిద్దాం అని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈరోజు నారా లోకేష్ జన్మదిన సందర్బంగా చెబుతున్న వైకుంఠం జ్యోతిను నమ్మినవాళ్లకు రుణపడి ఉంటాను అన్నారు. రాష్ట్రమంతా యువగలం పాదయాత్రతో యువతకు స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి మన నారా లోకేష్ అన్నారు. ఆలూరుకు వస్తే వైకుంఠం కుటుంబం నాకు గుర్తొస్తుంది అని మన టీడీపీ అధినేత నారా చంద్రబాబు అన్నారు, మాకు ఆ మాటే చాలు. యువగలం పాదయాత్ర సమయంలో ఏమి ఆశించుకుండ, నారా లోకేష్ వెంట నడిచాము. నన్ను నమ్మి ఆలూరు భవిష్యత్తు నాచేతిలో పెట్టారు, రానున్న 2029 ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి నారా లోకేష్, మరియు నారా చంద్రబాబుకు బహుమతిగా అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో ఆరు జడ్పీటీసీలు, ఆరు ఎంపీపీలు గెలిచి మన సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, ఏబీసీ కెనాల్ డిస్ట్రిబ్యూట్ చైర్మన్ నాగరడోన కిష్టప్ప, నీటి సంఘాల అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, దెగులపాడు మీసాల రామాంజి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లెకల్ వెంకటేష్, ఆలూరు సొసైటీ చైర్మన్ బెవిని ఈరన్న, చిప్పగిరి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, చిప్పగిరి సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, దేవనకొండ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, చిప్పగిరి మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, దెగులపాడు సర్పంచ్ నిలకంఠ, ఎల్లర్తి మల్లికార్జున, ఆలూరు మండలం కన్వీనర్ కటారికొండ శీనప్ప, వలిగొండ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు చిన్నయాట శేషగిరి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప, చింతకుంట సొసైటీ చైర్మన్ గూళ్యం ప్రకాష్, హోలహర్వి మండల కన్వీనర్ శ్రీధర్, పాల్గొన్న మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, దేవనకొండ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, బంటనహాల్ సర్పంచ్ సురేష్, అశోక్ యాదవ్, రామదుర్గం రామచంద్ర, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.





# వివో వి 70 సిరీస్‌లో కొత్త ఫోన్..



హైదరాబాద్ 23 జనవరి 2026 ,మనగళం : వివో సంస్థ త్వరలో వి 70 సిరీస్‌లో కొత్త స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ సిరీస్‌లో వి 70 ఎఫ్ ఈ మోడల్ కూడా ఉండనుందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యూరోప్ ధృవీకరణ వెబ్‌సైట్‌లో వి 2550 మోడల్‌గా కనిపించిన ఈ ఫోన్ భారీ సామర్థ్యమైన 6870 ఎంఏహెచ్ బ్యాటరీతో రానుంది. ఇందులో 55 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం ఉండటంతో తక్కువ సమయంలోనే పూర్తి ఛార్జ్ అవుతుందని చెబుతున్నారు. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 67 గంటల 21 నిమిషాల వరకు బ్యాటరీ బ్యాకప్ అందించే అవకాశం ఉందని అంచనా. ఈ ఫోన్‌కు దుమ్ము, నీటి నుంచి రక్షణ కలిగించే ఐపీ 68 రేటింగ్ ఉండనుంది. అలాగే గీతలు పడకుండా కాపాడే లెవల్ 4 రక్షణ, ఐదు సంవత్సరాల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ వంటి ప్రత్యేకతలు ఉండనున్నాయి. మరమ్మతుల విషయంలో సీ రేటింగ్ రావడంతో కొంత జాగ్రత్త అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

కొత్త డిజైన్, అధిక రిఫ్రెష్ రేట్ స్క్రీన్, మెరుగైన కెమెరా వ్యవస్థ, వేగవంతమైన నెట్‌వర్క్ సపోర్ట్ వంటి ఫీచర్లతో ఈ ఫోన్ వినియోగదారులను ఆకట్టుకునే అవకాశముంది. త్వరలో భారత్‌తో పాటు యూరోప్ మార్కెట్‌లో కూడా ఈ ఫోన్ విడుదల కానుందని సమాచారం. టెక్నాలజీ ప్రేమికుల్లో ఇప్పటికే దీనిపై ఆసక్తి పెరుగుతోంది.



# ప్రపంచకప్ దూరమైతే బంగ్లాకు భారీ షాక్..

హైదరాబాద్ 23-01-2026 ,మనగళం: 20 ఓవర్ల ప్రపంచకప్ 2026లో బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకపోతే ఆ దేశ క్రికెట్ బోర్డుకు భారీ ఆర్థిక నష్టం తప్పదని క్రీడా వర్గాలు అంచనా వేస్తున్నాయి. భద్రతా కారణాలు చూపిస్తూ భారత్‌లో మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేయగా, వేదికలను శ్రీలంకకు మార్చాలన్న ప్రతిపాదనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది. టోర్నీ ప్రారంభానికి సమయం తక్కువగా ఉండటంతో వేదికల మార్పు సాధ్యం కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ తమ నిర్ణయంలో మార్పు లేదని బంగ్లా బోర్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ జట్టు టోర్నీ నుంచి వైదొలిగితే సుమారు 27 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు 240 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ప్రసార హక్కులు, స్పాన్సర్ ఒప్పందాల రూపంలో వచ్చే వార్షిక ఆదాయంలో దాదాపు 60 శాతం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది ఆ దేశ క్రికెట్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు బంగ్లాదేశ్ తప్పుకుంటే వారి స్థానంలో స్కాట్లాండ్ జట్టు టోర్నీలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఈ అంశంపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముందని తెలుస్తోంది. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితులపై




స్కాట్లాండ్ క్రికెట్ ప్రతినిధులు స్పందించేందుకు నిరాకరించగా, ఏ నిర్ణయం వచ్చినా తమ వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తామని తెలిపారు. ప్రపంచకప్ ఆడకపోతే కేవలం క్రీడాపరమైన నష్టం మాత్రమే కాదు, ఆర్థికంగా కూడా బంగ్లాదేశ్‌కు పెద్ద దెబ్బ తగలనున్న నేపథ్యంలో అక్కడి అభిమానులు, క్రీడా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# హైదరాబాద్‌పై సర్ఫరాజ్ గర్జన..



హైదరాబాద్ 23-01-2026 ,మనగళం: దేశవాళీ క్రికెట్‌లో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ అద్భుత ప్రదర్శనతో అభిమానులను ఉర్రూతలూగించాడు. హైదరాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కేవలం 219 బంతుల్లోనే 227 పరుగులు సాధించి మెరుపు డబుల్ సెంచరీతో చెలరేగిపోయాడు. అతని ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు, 9 సిక్సర్లు ఉండటం విశేషం. స్టేడియం అంతా చప్పట్లతో మార్మోగిపోయింది.ప్రత్యర్థి జట్టు కెప్టెన్‌గా ఉన్న ప్రముఖ ఫాస్ట్ బౌలర్ బౌలింగ్‌లో సర్ఫరాజ్ కేవలం 39 బంతుల్లోనే 45 పరుగులు సాధించి తన దూకుడును చాటాడు. ఒక దశలో 82 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడిన జట్టును సర్ఫరాజ్ అద్భుత భాగస్వామ్యంతో నిలబెట్టాడు. నాలుగో వికెట్‌కు 249 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు బలమైన స్కోర్ అందించాడు.

ఈ ఇన్నింగ్స్‌తో సర్ఫరాజ్ తన ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 5000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇటీవలి కాలంలో వరుసగా భారీ స్కోర్లు సాధిస్తూ తన ఫామ్‌ను నిరూపించుకుంటున్నాడు. గతంలో కూడా అతడు వేగంగా అర్ధశతకం చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ స్థాయి ప్రదర్శనతో మళ్లీ జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు. అభిమానులు అతని ఆటను చూసి భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పవర్ ప్లేలో పిడుగు దాడి రహస్యం ఇదే..

ముంబై 23 జనవరి 2026 ,మనగళం: భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన దూకుడైన ఆటతీరుకు స్ఫూర్తి ఎవరో వెల్లడించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్ వెనుక రోహిత్ శర్మ ప్రేరణ ఉందని స్పష్టం చేశాడు. పవర్ ప్లేలో జట్టుకు బలమైన ఆరంభాలు ఇవ్వడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. రాబోయే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నానని అభిషేక్ పేర్కొన్నాడు. రోహిత్ శర్మ దేశం కోసం చేసిన సేవలు తనకు ఎంతో ప్రేరణనిస్తాయని అభిషేక్ తెలిపారు. ముఖ్యంగా పవర్ ప్లేలో అతను ఇచ్చే వేగవంతమైన ఆరంభాలు అద్భుతమని ప్రశంసించారు. తాను జట్టులోకి వచ్చినప్పుడు కోచ్, కెప్టెన్ కూడా తొలి బంతి నుంచే దూకుడుగా ఆడాలని సూచించారని చెప్పారు. అదే తన సహజ శైలికి సరిపోవడంతో ఆ విధానాన్ని కొనసాగిస్తున్నానని వెల్లడించారు.

ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ ఇన్నింగ్స్ తన ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని అభిషేక్ చెప్పారు. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సాధన చేస్తానని, సిరీస్‌కు ముందు వారిని దృష్టిలో పెట్టుకుని ప్రాక్టీస్ ప్లాన్ చేస్తానని తెలిపారు. ప్రపంచకప్‌లో బౌలర్లు సులభంగా పరుగులు ఇవ్వరని తెలుసు కాబట్టి ముందుగానే సిద్ధమవుతున్నానని చెప్పారు.



తన బ్యాటింగ్‌లో మెరుగైన ఫలితాల కోసం బ్యాక్ లిఫ్ట్‌లో చిన్న మార్పు చేసుకున్నానని, దాంతో బంతిని మరింత సులభంగా ఎదుర్కొగలుగుతున్నానని అభిషేక్ వివరించారు. జట్టు విజయం కోసమే ప్రతీ మ్యాచ్‌లో పూర్తి స్థాయిలో రాణించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని స్పష్టం చేశారు.

# పదేళ్ల ప్రస్థానం..




హైదరాబాద్ 23 జనవరి 2026 ,మనగళం : భారత స్టార్ వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుని మరో గొప్ప మైలురాయిని అందుకున్నారు. 2016లో భారత జట్టుకు అరంగేట్రం చేసిన బుమ్రా తన ప్రత్యేకమైన బౌలింగ్ శైలితో ప్రపంచ వ్యాప్తంగా బ్యాటర్లకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. తొలినాళ్లలో ఆయన యాక్షన్‌పై అనేక సందేహాలు వ్యక్తమైనా అవన్నీ తప్పని నిరూపిస్తూ స్థిరమైన ప్రదర్శనతో ముందుకు సాగారు.

ఈ పదేళ్ల ప్రయాణంలో బుమ్రా టెస్టుల్లో 234 వికెట్లు, వన్డేల్లో 149 వికెట్లు, టి20ల్లో 103 వికెట్లు సాధించి భారత బౌలింగ్ దళానికి ప్రధాన బలంగా నిలిచారు. కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని విజయాలను అందించడంలో ఆయన పాత్ర అమూల్యమైనది. క్రమశిక్షణ, కఠిన సాధన, ఆటపై అంకితభావం వల్లే ఈ స్థాయికి చేరుకున్నారని క్రీడా నిపుణులు ప్రశంసిస్తున్నారు.

2024 సంవత్సరానికి ఉత్తమ క్రికెటర్‌గా గౌరవం పొందిన బుమ్రా ప్రస్తుతం కూడా అదే జోరుతో కొనసాగుతున్నారు. రాబోయే టి20 ప్రపంచకప్‌లో భారత బౌలింగ్ బాధ్యతలు ప్రధానంగా ఆయన భుజాలపై ఉండనున్నాయి. అభిమానులు కూడా బుమ్రా మరో ఎన్నో రికార్డులు సాధించి భారత జట్టుకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షిస్తున్నారు.

# చరిత్రలో మరో స్వర్ణ అధ్యాయం..

హైదరాబాద్ 23-01-2026 ,మనగళం :భారత స్టార్ షట్లర్ పీవీ సింధు కెరీర్‌లో 500 విజయాలు సాధించి చరిత్ర సృష్టించడంతో దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచిన సింధును తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి అభినందించారు. ఆట పట్ల ఆమె చూపిన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల యువతకు ఆదర్శమని రేవంత్ కొనియాడారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని పేర్కొంటూ భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

2009లో అంతర్జాతీయ స్థాయిలో ప్రస్థానం ప్రారంభించిన సింధు గత 16 సంవత్సరాలుగా నిలకడైన ప్రదర్శనతో ఈ అరుదైన మైలురాయిని చేరుకుంది. ఒలింపిక్స్‌లో రజత, కాంస్య పతకాలు, ప్రపంచ స్థాయి బంగారు పతకం వంటి ఎన్నో ప్రతిష్టాత్మక విజయాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. మహిళల సింగిల్స్ విభాగంలో అత్యధిక విజయాలు సాధించిన అగ్రశ్రేణి క్రీడాకారిణుల జాబితాలో సింధు స్థానం సంపాదించింది.బ్యాడ్మింటన్ వంటి తీవ్రమైన శారీరక శ్రమ అవసరమైన క్రీడలో 500 విజయాలు సాధించడం ఆమె దృఢమైన శారీరక




దృఢత్వానికి, అచంచలమైన మనోధైర్యానికి నిదర్శనం. గాయాలు, ఫామ్‌లో హెచ్చుతగ్గులు ఎదురైనా ప్రతి సారి మరింత బలంగా తిరిగి నిలబడింది. సైనా నెహ్వాల్ తర్వాత భారత బ్యాడ్మింటన్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన సింధు ఈ ఘనతతో తన మహత్తర స్థాయిని మరింత బలపరుచుకుంది.

# రోహిత్‌కే మళ్లీ వన్డే సారథ్యం..

న్యూఢిల్లీ జనవరి 23 ,మనగళం : భారత వన్డే జట్టుకు మళ్లీ రోహిత్ శర్మనే కెప్టెన్‌గా నియమించాలని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి బీసీసీఐకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ వరుస ఓటములు ఎదుర్కొంటుండటం ఆందోళన కలిగిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియా పర్యటనలో 21 తేడాతో ఓడిపోవడంతో పాటు, స్వదేశంలోనే న్యూజిలాండ్ చేతిలో కూడా 21 తేడాతో సిరీస్ కోల్పోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. భారత గడ్డపై న్యూజిలాండ్ తొలిసారి వన్డే సిరీస్ గెలవడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన మనోజ్ తివారి, వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ప్రయోగాలు అవసరం లేదని స్పష్టం చేశారు. రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగితే జట్టు స్థిరత్వం, అనుభవం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. న్యూజిలాండ్ సిరీస్‌లో రోహిత్ సారథ్యంలో భారత్ ఆడిఉంటే ఫలితం పూర్తిగా భిన్నంగా ఉండేదని అన్నారు. రోహిత్ నాయకత్వంలో జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడుతుందని, పెద్ద టోర్నీల్లో ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం ఉందని తెలిపారు. గిల్ ప్రతిభావంతుడైన ఆటగాడేనని అంగీకరిస్తూనే, ప్రపంచకప్ లాంటి కీలక టోర్నీలో అనుభవం ఉన్న నాయకుడే జట్టును ముందుకు నడిపించగలడని తివారి అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మను మళ్లీ కెప్టెన్‌గా నియమిస్తే భారత్‌కు కచ్చితంగా ప్రపంచకప్ గెలిచే అవకాశాలు పెరుగుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.





Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.